


APTEL/2015/65279

Postal Reg.No. MPM/L22/VNEWS/22-24

# V న్యూస్

మన ఊరు - మన వార్తలు

తెలుగు దినపత్రిక

e-mail : vnewsmachilipatnam@gmail.com
e-mail : vnewsindia@gmail.com




సంపుటి :9 సంచిక : 207 మచిలీపట్నం, విజయవాడ, కాకినాడ, గుంటూరు, ఖమ్మం, వైఎస్ఆర్ కడప, ఒంగోలు, పొట్టి శ్రీరాములు నెల్లూరు 03-01-2023 మంగళవారం పేజీలు :4 వెల : రూ.3/-







# గృహ నిర్మాణంపై సమీక్ష.. సీఎం జగన్ కీలక ఆదేశాలు



**అమరావతి :** గృహ నిర్మాణ శాఖపై తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా హౌసింగ్ ప్రగతిని అధికారులు వివరించారు. ఇళ్ల నిర్మాణం వేగంగా సాగుతోందని తెలిపారు. టిడ్కో కాకుండా ఈ ఆర్థిక సంవత్సరంలో ఇళ్ల నిర్మాణంకోసం రూ. 6,435 కోట్ల రూపాయలను ప్రభుత్వం ఖర్చు చేసిందని అధికారులు పేర్కొన్నారు.

క్రమం తప్పకుండా ఆయా లే అవుట్లకు వెళ్లి ఇళ్ల నిర్మాణ ప్రగతిని పరిశీలిస్తున్నామని, డిసెంబర్ నెలలో 4 సార్లు లే అవుట్లను పరిశీలించామని అధికారులు వెల్లడించారు. సీఎం ఆదేశాల మేరకు ఇళ్ల నిర్మాణ నాణ్యతపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. మొత్తం నాలుగు రకాల పరీక్షలు నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. అన్ని లే అవుట్లలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని, దీనికి అవసరమైన ల్యాబ్‌లు కూడా ఏర్పాటు చేసుకుంటున్నట్టు అధికారులు వెల్లడించారు.

ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ ఇళ్లు పూర్తయ్యే నాటికి కరెంటు, నీళ్లు, డ్రైనేజీ ఈ మూడు సౌకర్యాలు కచ్చితంగా కల్పించాలి. అలాగే ఇళ్ల లబ్ధిదారులతో ఎప్పటికప్పుడు మాట్లాడి నిర్ణీత దశకు రాగానే వాటికి కరెంటు కనెక్షన్లు ఇవ్వాలి. వివిధ కోర్టు వివాదాల వల్ల ఇళ్ల నిర్మాణం నిలిచిపోయిన చోట్ల ప్రత్యామ్నాయాలను వెంటనే చూడాలని సీఎం ఆదేశించారు. కోర్టు కేసులు పరిష్కారం కాని చోట వెంటనే ప్రత్యామ్నాయ స్థలాలు చూసి ఇళ్లనిర్మాణాలు ప్రారంభించాలని సీఎం ఆదేశించారు.

ఈ సమీక్షా సమావేశంలో గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఏపీ హౌసింగ్ కార్పోరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు, టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, సీఎస్ డాక్టర్ కె ఎస్ జవహర్‌రెడ్డి, గృహనిర్మాణశాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ స్పెషల్ సీఎస్ జి సాయి ప్రసాద్, ఇంధనశాఖ స్పెషల్ సీఎస్ కె. విజయానంద్, ఏపీ టిడ్కో ఎండీ సీహెచ్ శ్రీధర్, సీసీఎల్ఏ కార్యదర్శి ఇంతియాజ్, ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ జి లక్ష్మీ షా, గృహనిర్మాణశాఖ ప్రత్యేక కార్యదర్శి మహమ్మద్ దీవాన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పెద్ద నోట్ల రద్దును సమర్థించిన సుప్రీంకోర్టు

**ఢిల్లీ :** పెద్ద నోట్ల రద్దు అంశంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రభుత్వ చర్యలను సుప్రీంకోర్టు ధర్మాసనం సమర్థించింది. ఈ తీర్పును జస్టిస్ ఎస్.ఎ.నజీర్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం వెలువరించింది. పెద్దనోట్ల రద్దును ధర్మాసనంలోని నలుగురు సభ్యులు సమర్థించారు. 2016 నవంబర్ 8 నోటిఫికేషన్ చెల్లుబాటు అవుతుందని సర్వోన్నత న్యాయస్థానం వెల్లడించింది.

ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితం ఆధారంగా నోట్ల రద్దు నిర్ణయాన్ని కొట్టివేయలేమని న్యాయస్థానం పేర్కొంది. ఈ నిర్ణయం వెనుక మూడు లక్ష్యాలను గుర్తించినట్లు వెల్లడించింది. దీంతోపాటు ఆ లక్ష్యాలను చేరుకోవడంలో కొన్ని తేడాలు ఉన్నాయని చెప్పింది. అలాగని వాటి ఆధారంగా ఈ చర్యలను కొట్టిపారేయలేమని తేల్చిచెప్పింది.

పెద్దనోట్ల రద్దుపై కేంద్రం తీసుకున్న నిర్ణయం లోపభూయిష్టంగా లేదని.. ఆర్బీఐ, కేంద్ర ప్రభుత్వం మధ్య సంప్రదింపుల తర్వాతే నిర్ణయం తీసుకున్నారని జస్టిస్ గవాయ్ తెలిపారు.

నోట్ల రద్దు విషయంలో కేంద్రం వైఖరిని జస్టిస్ నాగరత్న తప్పుపట్టారు. నోట్ల రద్దు విషయంలో ప్రభుత్వం కేవలం గెజిట్ నోటిఫికేషన్ ద్వారా కాకుండా ప్లీనరీ చట్టం రూపంలో నిర్ణయం వెలువరించాల్సిందని అభిప్రాయపడ్డారు. "ఈ చర్యను



మంచి ఉద్దేశంతోనే బాగా ఆలోచించి చేపట్టారు. ముఖ్యంగా బ్లాక్ మనీ, టెర్రర్ ఫండింగ్, దొంగనోట్లను లక్ష్యంగా చేసుకొని దీనిని తీసుకొన్నారు. కానీ, ఆ లక్ష్యాలను దృష్టిలో పెట్టుకోకుండా.. పూర్తిగా చట్టవిరుద్ధంగా తీసుకొన్న చర్య ఇది. 2016లో వెలువడిన నోటిఫికేషన్ ఇది. దీనిపై ఇప్పుడు ఎటువంటి స్టే ఇవ్వలేం. న్యాయస్థానం జరగబోయే వాటిపైన చర్యలు తీసుకోగలదు. నోట్ల రద్దు ఇప్పటికే జరిగిపోయింది. పిటిషనర్లకు ఎటువంటి ఉపశమనం ఇవ్వలేం" అని జస్టిస్ నాగరత్న పేర్కొన్నారు.

పెద్ద నోట్ల రద్దుకు వ్యతిరేకంగా దాఖలైన 58 పిటిషన్లను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు సోమవారం తీర్పును వెలువరించింది. కేంద్ర ప్రభుత్వం 2016లో రూ.500, రూ.1000 నోట్లను రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం.. కేంద్రం తీసుకున్న నిర్ణయానికి సంబంధించిన రికార్డులను అందజేయాలని కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐలను గత డిసెంబరు 7న ఆదేశించింది. జస్టిస్ ఎస్.ఎ.నజీర్ నేతృత్వంలోని అయిదుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఇప్పటికే విచారణను ముగించి తీర్పును నేటికి రిజర్వు చేసింది. నేడు ఈ అంశంపై రెండు వేర్వేరు తీర్పులు వెలువడ్డాయి. ధర్మాసనం సభ్యులు జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ బి.వి.నాగరత్న రెండో తీర్పు వెలువరించారు. వీరిచ్చిన రెండు తీర్పులు భిన్నంగా ఉన్నాయి.

## నోట్ల రద్దుపై సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం



**ఢిల్లీ :** పెద్ద నోట్ల రద్దుపై భారత అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి వి. చిదంబరం స్వాగతించారు. ముఖ్యంగా నోట్ల రద్దు లక్ష్యం నెరవేరిందా అనే అంశంపై సుప్రీం ధర్మాసనం స్పష్టత ఇచ్చిందన్నారు. మెజారిటీ ధర్మాసనం దీనికి మద్దతు పలికినప్పటికీ.. మైనార్టీ తీర్పు మాత్రం ప్రభుత్వానికి చెంపపెట్టు వంటిదన్నారు. నోట్ల రద్దు చట్టవిరుద్ధమంటూ ధర్మాసనంలోని జస్టిస్ నాగరత్న చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ చిదంబరంహౌఈ విధంగా స్పందించారు.

'నోట్ల రద్దుపై భారత అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును గౌరవిస్తాం. అయినప్పటికీ, ఈ నిర్ణయాన్ని అందరూ సమర్థించారా, ప్రభుత్వం వాటి లక్ష్యాలను సాధించిందా అనే అంశాన్ని ప్రస్తావించడం అవసరం. లక్ష్యాలను సాధించే అంశంపై సుప్రీం కోర్టులోనిహౌమెజారిటీ ధర్మాసనం స్పష్టత ఇచ్చింది. ఇదే సమయంలో నోట్ల రద్దు చట్టవిరుద్ధ మార్గంలో జరిగినట్లు ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తిహౌపేర్కొనడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నాం. ఇది ప్రభుత్వానికి చెంపపెట్టు వంటిది' అని కేంద్ర మాజీ ఆర్థికశాఖ మంత్రి పీ చిదంబరం అభిప్రాయపడ్డారు.

## చైనాలో రోజుకు 9 వేల మరణాలు

**చైనా :** చైనాలో కొవిడ్ భయానకంగా విస్తరిస్తోందని బ్రిటన్‌కు చెందిన ఓ హెల్త్‌డేటా విశ్లేషణ సంస్థ 'ఎయిర్‌ఫినిటీ' పేర్కొంది. జీరో కొవిడ్ పాలసీని చైనా వదిలినప్పటి నుంచి రోజుకు సగటున 9,000 మరణాలు సంభవిస్తున్నాయని అంచనా వేసింది. ఈ అంచనాకు వచ్చేందుకు 'ఎయిర్‌ఫినిటీ' తీవ్ర కసరత్తు చేసింది. చైనాలోని రీజనల్ ప్రావిన్స్‌ల్లో ఇన్ఫెక్షన్ల సంఖ్యను రిపోర్టు చేసే విధానంలో మార్పులకు ముందు నమోదైన గణంకాలు, గతంలో జీరో కొవిడ్‌ను పాటించిన దేశాల్లో ఆంక్షలు ఎత్తి వేసిన తర్వాత నమోదైన కేసుల రేటును విశ్లేషించి ఈ అంచనాకు వచ్చింది. ఒక్క డిసెంబరులోనే చైనాలో లక్ష మంది వరకు కరోనాతో మరణించి ఉండొచ్చని పేర్కొంది. ఈ సమయంలో ఎంత లేదన్నా.. 1.8 కోట్ల కొవిడ్ కేసులు నమోదై ఉండొచ్చని తెలిపింది. జనవరి నాటికి రోజువారీగా 34 లక్షల కేసులు రావొచ్చని వెల్లడించింది. చైనా కొవిడ్ గణాంకాల్లో పారదర్శకత లేకపోవడంతో మెరుగైన నిర్ణయాలు తీసుకోవడం కష్టమవుతుందని బ్రిటన్‌కు చెందిన 'బయోసైన్స్ రిసోర్స్ ప్రాజెక్ట్' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జోనాథన్ లాథమ్‌హౌహౌతెలిపారు. చైనాలో కొవిడ్ కేసుల సంఖ్యను దాచిపెట్టడం సమస్యను తీవ్రం చేస్తోందని ఆస్ట్రేలియా పత్రిక 'న్యూస్.కామ్.ఏయూ' పేర్కొంది. అక్కడ మార్చినాటికి కనీసం 100 కోట్ల మందికి వైరస్ సోకవచ్చని పేర్కొంది. చైనాపై విమర్శలు పెరగడంతో ఇటీవల ఆ దేశ అధికారులు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో)తో భేటీ అయ్యారు. చైనా నుంచి జన్యు సమాచారం, మరణాల వివరాలు, ఆసుపత్రుల్లో చేరుతున్న రోగుల గణంకాలు మరింత లోతుగా ఇవ్వాలని డబ్ల్యూహెచ్‌వో అధికారులు చైనాను కోరారు. మరోవైపు ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలు చైనాపై ఆంక్షలు విధిస్తున్నాయి.హౌ

చైనాకు సాయం చేస్తాం: తైవాన్

కొవిడ్‌ను ఎదుర్కొనేందుకు చైనాకు అవసరమైన సాయం అందజేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని తైవాన్ అధ్యక్షురాలు త్సాయ్ ఇంగ్ వెన్ పేర్కొన్నారు. అయితే.. తమ దేశం వద్ద చైనా సైనిక కార్యకలాపాలు శాంతికి, స్థిరత్వానికి ఏ రకంగానూ ఉపయోగపడవని పేర్కొన్నారు. "వారికి అవసరం ఉన్నంత వరకు మానవీయ కోణంలో.. ప్రజలు మహమ్మారి నుంచి బయటపడేలా అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం" అని త్సాయ్ చెప్పారు.

## పాక్, భారత్ మధ్య అణు సమాచార మార్పిడి

**ఇస్లామాబాద్:** భారత్, పాకిస్థాన్ మధ్య భవిష్యత్‌లో ఉద్రిక్తతలు పెరిగిపోతే దాడులు చేయకూడదని అణు కేంద్రాలు, స్థావరాలపై సమాచారాన్ని ఇరు దేశాలు ఇచ్చిపుచ్చుకున్నాయి. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య సంబంధాలు క్షీణించినప్పటికీ మూడు దశాబ్దాలుగా ప్రతీ ఏడాది జరిగే అణు సమాచారాన్ని ఇరుదేశాలు ఒకరికొకకు అందించుకున్నట్టుగా విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

1991లో ఇరు దేశాల మధ్య అమల్లోకి వచ్చినహౌఅణు కేంద్రాలు, స్థావరాలపై దాడులు నిషిద్ధమనే ఒప్పందం మేరకు ఈ స్థావరాల వివరాలు అందించుకున్నారు. ఈ ఒప్పందంపై 1988, డిసెంబర్ 31న సంతకాలు జరగగా.. 1991, జనవరి 27న అమలులోకి వచ్చింది. న్యూఢిల్లీ, ఇస్లామాబాద్‌లో ఒకేసారి ఈ ప్రక్రియను చేపట్టినట్లు భారత విదేశాంగ శాఖ తెలిపింది. తొలిసారి 1992లో అణు సమచారాన్ని ఇచ్చిపుచ్చుకోగా.. 32 ఏళ్లుగా ప్రతిఏటా ఈ సంప్రదాయం కొనసాగుతున్నట్లు పేర్కొంది.

## తిరుమలలో వైభవంగా స్వర్ణ రథోత్సవం



**తిరుమల :** తిరుమలలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామి స్వర్ణ రథోత్సవంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వైకుంఠ ద్వారం ద్వారా తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తజనం పోటెత్తారు. శ్రీవారికి నిర్వహించే కైంకర్యాలు పూర్తి చేశాక అర్ధరాత్రి 12.05 గంటలకు దర్శనాలను ప్రారంభించారు. ముందుగా వీఐపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ధర్మకర్తల మండలి సభ్యులు దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు శ్రీవాణి ద్వారా టోకెన్లు పొందిన భక్తులను దర్శనానికి అనుమతించారు.

## మద్యం కుంభకోణం కేసు.. నిందితుల రిమాండ్ పొడిగింపు

**ఢిల్లీ :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన నిందితులకు మరోసారి రౌస్ అవెన్యూ సీబీఐ ప్రత్యేక కోర్టు జ్యుడీషియల్ రిమాండ్‌ను పొడిగించింది. కేసు దర్యాప్తు కీలక దశలో ఉన్నందున, నిందితులకు రిమాండ్ వ్యవధిని పెంచాలని ఈడీ విజ్ఞప్తి చేసింది. నిందితులుగా ఉన్న శరత్ చంద్రారెడ్డి, బినోయ్‌బాబు, విజయ్‌నాయర్, అభిషేక్ బోయిన్‌పల్లి జ్యుడీషియల్ రిమాండ్ డిసెంబరు 30తో ముగిసినందున వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారిని ఈడీ అధికారులు కోర్టు ఎదుట హాజరుపరిచారు. ఈడీ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం ఈ నెల 7వరకు జ్యుడీషియల్ రిమాండ్‌ను




పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. మద్యం కేసుపై దర్యాప్తు చేపడుతున్న ఈడీ.. ఈనెల 5న మరో ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తామని కోర్టుకు తెలిపింది. సౌత్ గ్రూప్ లావాదేవీలపై సప్లిమెంటరీ ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తామని పేర్కొంది.

ఈ కేసులో నవంబరు 10న శరత్ చంద్రారెడ్డి, బినోయ్‌బాబులను అరెస్టు చేసిన ఈడీ.. అంతకు ముందు సెప్టెంబరు 27న విజయ్‌నాయర్, అక్టోబర్ 10న అభిషేక్ బోయిన్‌పల్లిని అరెస్టు చేసింది. సౌత్‌గ్రూప్ లావాదేవీల్లో ఈ నలుగురూ కీలకంగా వ్యవహరించారని ఈడీ తేల్చింది. మరోవైపు ఈ కేసులో అరెస్టయిన మరో నిందితుడు సమీర్ మహేంద్రు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై మంగళవారం రౌస్ అవెన్యూ సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం విచారణ చేపట్టనుంది. అభిషేక్, విజయ్‌నాయర్ బెయిల్ పిటిషన్లపై 4న, శరత్ చంద్రారెడ్డి బెయిల్ పిటిషన్‌పై 7న, బినోయ్‌బాబు బెయిల్ పిటిషన్‌పై 9న విచారణ జరగనుంది.

# సాహితీ రంగవల్లికలు

ఇది ధనుర్మాసం. ముగ్గుల మాసం. మకర సంక్రాంతి వరకు ముంగిళ్లలో ముగ్గుల వ్రతాన్ని మహిళలు అప్రతిహతంగా కొనసాగిస్తారు. క్రీస్తుపూర్వం పదిహేనో శతాబ్ది ప్రాంతంలో ఆర్యులు అడుగు పెట్టే నాటికే, సింధులోయ నాగరికత పరిఢవిల్లిన చోట ముగ్గులు ఉండేవనేందుకు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఆ లెక్కన ముగ్గులు పురాణాల కంటే ప్రాచీనమైనవి. కచ్చితంగా చెప్పుకోవాలంటే, వేదకాలం నాటివి. ముగ్గులు ఆదిమ చిత్రకళా రూపాలు. సింధులోయ ప్రాంతంలోనే కాదు... గ్రీకు, ఈజిప్టు శిల్పాల్లోనూ ముగ్గుల ఆనవాళ్లున్నాయి.

ముగ్గులను సంస్కృతంలో రంగవల్లిక అంటారు. సౌరసేని ప్రాకృతంలోని 'రంగౌలి' అనే మాట నుంచి ఈ సంస్కృత పదం పుట్టింది. హిందీ, ఉర్దూల్లో 'రంగోలి' అంటారు. వాల్మీకి రామా యణంలోని యుద్ధకాండలో 'ఏకశృంగో వరాహస్త్వం' అనే వర్ణన ఉంది. సింధులోయ నాగరికత ప్రాంతంలో దొరికిన ముగ్గులలో ఒంటికొమ్ము వరాహరూపం ఈ వర్ణనకు సరిపోతుంది. అంతే కాదు, హరప్పాహొప్రాంతంలో దొరికిన వాటిలో ఊర్ధ్వపుండ్రం, త్రిశూలం, అగ్నిగుండం, శివలింగం తదితర రూపాలలోని మెలికల ముగ్గులూ ఉన్నాయి.హొ

సున్నపురాతి నుంచి తయారుచేసిన ముగ్గుపిండితోనూ, వరిపిండితోనూ ముగ్గులు వేయడం ఇప్పటికీ అన్ని చోట్లా వాడుకలో ఉన్న ప్రక్రియ. పురాణకాలంలో కర్పూరంతో రంగవల్లులను తీర్చి దిద్దేవారట! నన్నయ మహాభారతం ఆదిపర్వంలో 'అంగుళలనొప్పె కర్పూర రంగవల్లులు' అని వర్ణించాడు. వారణావతంలోని లక్క ఇంట్లో ఉండటానికి కుంతీసమేతంగా పాండవులు వస్తున్న పుడు వారికి స్వాగతం పలకడానికి వారణావతపుర వాసులు ఇంటింటా ముంగిళ్లలో కర్పూరంతో ముగ్గులు వేశారని నన్నయ వర్ణన.

'చిత్రవర్ణాతిశయ నూత్న రత్న చిత్రి/తాంగ రంగవల్లి సురగాంగణముల' అంటూ శివపురంలోని రంగురంగుల రంగవల్లులను నన్నెచోడుడు 'కుమారసంభవం'లో వర్ణించాడు. సీతాదేవి చేత జనక మహారాజు ముగ్గులు వేయించాడట! 'సంతానపరుడమ్మ జనక మహాముని/ తా ముద్దు కూతురిని తా జేరబిలిచి/ ఆవుపేడ తెచ్చి అయినిళ్లు అలికి/ గోవుపేడ తెచ్చి గోపురాలు అలికి/ ముత్యాలు చెడగొట్టి ముగ్గులేయించి' అని జానపద గీతం ఉంది.

'పలనాటి వీరచరిత్ర'లో శ్రీనాథుడు ముత్యాల ముగ్గులను వర్ణించాడు. 'కస్తూరి చేతను కలియ గనలికి/ ముత్యాల తోడ ముగ్గులను బెట్టి/ కర్పూర ముదకంబు కలిపి ముంగిటన్' అంటూ సంక్రాంతి సమయంలో ఆనాటి ముగ్గుల వేడుకను కళ్లకు కట్టాడు. క్రీడాభిరామంలో వినుకొండ వల్లభరాయడు 'చందనంబున గలయంపి చల్లినారు/ ముగ్గులిడినారు కాశ్మీరమున ముదమున/ వ్రాసినా రిందు రజమున రంగవల్లి/ కంజముల దోరణంబులు గట్టినారు' అంటూ చందనంతో కళ్లాపి చల్లి ఆపైన ముగ్గులు వేసిన వైనాన్ని వివరించాడు. 'బోటి గట్టిన చెంగల్వపూవుటెత్తు/ దరు పరిణతోరు కదళి మంజరియు గొనుచు/ బోయి గుడినంబి విజనంబు జేయ జొచ్చి/ మ్రొక్కి వేదిక బలు వన్నె మ్రుగ్గు బెట్టె' అంటూ శ్రీకృష్ణదేవరాయలు తన 'ఆముక్తమాల్యద'లో ఆలయాల్లో ముగ్గులు వేసే ఆనాటి ఆచారాన్ని వర్ణించాడు.

ఆధునికుల్లో తిరుమల రామచంద్ర ముగ్గువేస్తున్న ముదిత గురించి చక్కని సంస్కృత శ్లోకం రాశారు. 'రచయంతీ రంగలతాం/ మంగళగాత్రీ సలీలం అంగణకే/ విటజన హృదయాంగణకే/ అనంగజ బాధాం విశాలయతి కునూనమ్'. చక్కని అమ్మాయి ముంగిట్లో ముగ్గుపెడుతూ విట జనుల హృదయాలలో మన్మథబాధను విస్తరింపజేస్తున్నదని దీని తాత్పర్యం.

ఈ శృంగార శ్లోకాన్ని ఆయన తన పదమూడేళ్ల ప్రాయంలోనే రాయడం విశేషం. 'ఉగ్గేల తాగుబోతుకు/ ముగ్గేల తాజ మహలు మునివాకిటిలో' అంటూ శ్రీశ్రీ తన 'సిరిసిరిమువ్వ శతకం'లో ముగ్గు ప్రస్తావన తెచ్చారు. నేల మీద ముగ్గులు మనుషులు వేస్తారు గానీ, నీలాకాశం మీద చుక్కల ముగ్గులు వేసేది సాక్షాత్తు భగవంతుడేనని కరుణశ్రీ నమ్మకం. 'పనిమాలి ప్రతిరోజుప్రాణికోటుల గుండె/ గడియారముల కీలు కదపలేక/ అందాలు చింద నీలాకాశ వేదిపై/ చుక్కల మ్రుగ్గులు చెక్కలేక/ ఎంతశ్రమ యొందు చుంటివో యేమొ స్వామి' అంటూ దేవుడి కష్టానికి కలత చెందడం ఆయనకే చెల్లింది!హొ

ముగ్గుతో ముడిపడిన జాతీయాలు, సామెతలు కూడా ఉన్నాయంటే, ముగ్గులు మన సంస్కృతిలో ఎంతగా పెనవేసుకుపోయాయో అర్థం చేసుకోవచ్చు. బాగా నెరిసిన తలను 'ముగ్గు బుట్ట' అంటారు. 'ముగ్గులోకి దించడం' అంటే ప్రత్యేకంగా వివరించనక్కర్లేదు. 'వాయువేగమును మించి, లోకాలను గాలించి, చిటికెలోనే ఉన్న చోటికే వచ్చు. అదేమిటి?' అనే ?పొడుపు కథ ఉంది. దీనికి సమాధానం 'ముగ్గు'. మొదలు పెట్టిన చోటే ముగించడం ముగ్గు కళలో ప్రత్యేకత. 'మరిగే నూనెలో ముచ్చటైన ముగ్గు. తీసి తింటే కరకరమంటుంది' అనే ?పొడుపు కథకు సమాధానం 'జంతిక'. జంతికలు చూడటానికి మెలికల ముగ్గుల్లాగానే ఉంటాయి కదా!

భారతీయులకు ముగ్గులు ముదితల వ్యవహారమే గానీ, కొన్ని ఆఫ్రికన్ దేశాల్లో ముగ్గులు వేయడం పురుషుల బాధ్యత. ఆఫ్రికన్లు ముగ్గులు వేయడానికి సున్నపురాతి ముగ్గుపిండి, వరిపిండి వంటివేమీ వాడరు. నేరుగా ఇసుకలోనే వేలితో లేదా కర్రపుల్లతో చుక్కలు పెట్టి, చుక్కల చుట్టూ మెలికల ముగ్గులు తీర్చిదిద్దుతారు. ముగ్గుల కళ దేశదేశాల్లో వ్యాపించి ఉన్నా, మన భారతీయ సాహిత్యంలో మాత్రం ముగ్గుల ప్రస్తావన విస్తారంగా కనిపిస్తుంది. అదీ విశేషం!

# జర్నలిస్ట్ లకు పలు వరాలు ప్రకటించిన యరపతినేని



**(వి న్యూస్ పిడుగురాళ్ల):** గురజాల నియోజకవర్గం పిడుగురాళ్ల పట్టణంలోని జర్నలిస్ట్ లకు ఆరోగ్య భీమా చేయించి... హెల్త్ కార్డు లను ఇస్తాను.తద్వారా కార్పోరేట్ హాస్పిటల్స్ లో ఉచిత వైద్యం జర్నలిస్టు ఏదైనా శుభకార్యం చేసుకుంటే పదివేల రూపాయలు అందిస్తాను.. దీనికి ఐదు లక్షలతో సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తాను. అధికారం లోకి వచ్చాక జర్నలిస్ట్ ల సొంత ఇంటి కల సాకారం చేస్తాను.. ప్రభుత్వం మంజూరు చేసే ఆర్థిక సహాయం కాకుండా నేను పలు సిమెంట్ కంపెనీలతో మాట్లాడి సిమెంట్ కట్టుబడి కి సిమెంట్ ఇప్పిస్తాను... తద్వారా మీకు కొంత భారం తగ్గుతుంది.. జర్నలిస్టుల సంక్షేమ నిధి ఏర్పాటు చేసి పాతిక లక్షలు ఇస్తాను...
మీకు అత్యవసర సమయాల్లో ఉపయోగపడటానికి ఇంకా మీకేమైనా ఇబ్బందులు ఉంటే నాతో చెప్పండి.. నా శక్తి మేరకు మీకు అండగా ఉంటానని తెలియచేస్తున్నాను – యరపతినేని శ్రీనివాసరావు.

# హనుమాన్ జంక్షన్‌లో వెంకటేశ్వర కళ్యాణం



**(వి న్యూస్ హనుమాన్ జంక్షన్):** హనుమాన్ జంక్షన్ లోని మూల్పురి సురేంద్ర సాయి కళ్యాణి గృహంలో తుమ్మల హిమబిందు పర్యవేక్షణలో 34 వ వెంకటేశ్వర గానామృతం, కళ్యాణ కార్యక్రమం సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. అంగరంగ వైభవంగా జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మహిళా భక్తులు పాల్గొని గానామృతం చేసి భక్తి పారవశ్యంలో మునిగారు.

# ఘనంగా సుషుమ్న క్రియా యోగ దీక్షా కార్యక్రమం



**(వి న్యూస్ విజయవాడ):** విశ్వగురువులు శ్రీ శ్రీ శ్రీ ఆత్మానందమయి అమ్మవారి సుషుమ్న క్రియా యోగ దీక్షా కార్యక్రమం, విజయవాడ ఏ కన్వెన్షన్ సెంటర్ లో ఘనంగా జరిగింది. నూతన సంవత్సరం, వైకుంఠ ఏకాదశి ప్రవేశం సమయం ఒకే రోజు రావటంతో అమ్మహొహొదర్శనార్ధం చాలా మంది అనేక ప్రాంతాల నుండి పూజ్యశ్రీ ఆత్మానందమయి అమ్మ వద్ద దీక్షనందుకోవటానికి తరలి వచ్చారు. ఆత్మానందమయి అమ్మ దివ్య బాబాజీ సుషుమ్న క్రియా యోగ ఫౌండేషన్ వ్యవస్థాపకులు. ఈ సంస్థ ద్వారా అమ్మ అంతర్జాతీయంగా అనేక సేవా కార్యక్రమాలను గత రెండు దశాబ్దాలుగా నిర్వహిస్తున్నారు. 2023 వ సంవత్సరం ప్రారంభంలో విజయవాడ కేంద్రంగా దీక్షా కార్యక్రమం జరగటం తమకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని అనేక సాధకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ కలెక్టర్ ఢిల్లీరావు, అధికార భాష సంఘం అధ్యక్షులు విజయబాబు, డీఐజీ కమ్యూనికేషన్స్‌హొఎన్ఎస్జే లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# దుప్పట్లు, పండ్లు పంపిణీ




**(వి న్యూస్ నెల్లూరు):** పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ , రత్నమ్మ చారిటబుల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో సండే మార్కెట్ యూనియన్ అధ్యక్షులు ఎమ్.డి. హాఫీ జుద్దీన్ సౌజన్యంతో సోమవారం నెల్లూరు బాలాజీ నగర్ లోని గీతామయి వృద్ధుల ఆశ్రమం నందు వృద్దులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విశ్రాంత లేబర్ కమీషనర్ రాచపాలెం రఘు మాట్లాడుతూ హాఫీజ్ తనకు వచ్చిన ఆదాయంలో కొంత ఇలా వృద్దులకు దుప్పట్లు, పండ్లు ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉన్నదని తెలిపారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్ రాజు మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ స్పందించే గుణాన్ని అలవరుచుకోవాలి. ఓ మనిషి నువ్వు సంపాదించడమే కాదు అందులో కొంత నీ చుట్టు ప్రక్కల ఉన్న నలుగురి ఆకలి తీర్చడానికి కూడా నువ్వు ఖర్చుచేయగలిగినప్పుడే నీ జీవితానికి ఒక అర్థం పరమార్థం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రయం అధినేత తమ్మినేని పాండు, గౌతమ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అరవ రాయప్ప, టీవీ.నటులు సింగంశెట్టి మురళీమోహన్, సండే మార్కెట్ యూనియన్ సభ్యులు పి.శరవణన్, కె.కుమరవేలు, వి. రామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

# విజయకుమార్‌కి ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయ పురస్కారం

**(వి న్యూస్ విజయవాడ):** క్రీడా రంగంలో రాణించి జాతీయ స్థాయిలో అనేక పథకాలు సాధించి, అనేక మంది క్రీడాకారులను జాతీయ స్థాయిలో తయారు చేస్తున్న గోగులమూడి విజయ్ కుమార్ కు జాతీయ స్థాయిలో ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుల పురస్కారం లభించింది. కృష్ణా జిల్లా గన్నవరం మండలం చిన్న అవుటపల్లి గ్రామానికి చెందిన గోగులమూడి విజయ్ కుమార్ కి రోజా క్రియేటివ్ కల్చరల్ వరంగల్



వారు ఈమేరకు కాజిపేటలో జరిగిన పురస్కార మహొత్సవ సభలో విజయ్ కుమార్ ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. ఈ పురస్కారం అందుకోవడం చాలా సంతోషంగా ఉందని, పురస్కార గ్రహీత విజయ్ కుమార్ ఈ సందర్భంగా అభిప్రాయం వ్యక్తం చేశారు.

# జోగయ్యకు మద్దతుగా కొట్టె దీక్ష

## -దీక్షను భగ్నం చేసిన పోలీసులు

## -కృత్తివెన్ను పోలీసు స్టేషన్‌కు తరలింపు -సాయంత్రం విడుదల



**(విన్యూస్–మచిలీపట్నం):** కాపు రిజర్వేషన్ల కోసం కాపు సంక్షేమ సేన వ్యవస్థాపకులు చేగొండి హరిరామ జోగయ్యకు మద్దతుగా కాపు సంక్షేమ సేన కార్యదర్శి కొట్టె వెంకట్రావు మచిలీపట్నంలో దీక్ష చేపట్టారు. బ్రహ్మపురంలోని తన స్వగృహంలో చేపట్టిన దీక్షకు పలువురు కాపు సంక్షేమ సేన నాయకులు, ప్రతినిధులు హాజరై మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా కొట్టె వెంకట్రావు మాట్లాడుతూ పది శాతం ఈ బిసి రిజర్వేషన్లలో 5శాతం కాపులకు కేటాయించాలనే డిమాండ్‌తో హరిరామజోగయ్య దీక్షకు దిగుతున్నట్లుగా ప్రకటించడంతో పోలీసులు ఆయన్ని అదుపులోకి తీసుకుని ఆసుపత్రికి తరలించారన్నారు. ఆరోగ్య కారణాలతోనే ఆయన దీక్ష భగ్నం చేశారని, కాని నా ఆరోగ్యం బాగానే
ఉందని తాను దీక్ష చేస్తానని స్పష్టం చేశారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కాపులకు 5శాతం రిజర్వేషన్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కొట్టె వెంకట్రావు దీక్ష గురించి తెలుసుకున్న పోలీసులు ఆయన స్వగృహంకు చేరుకున్నారు. ఈ సందర్భంగా కొట్టెకు పోలీసులకు కాసేపు వాగ్వాదం జరిగింది. తన ఇంట్లో దీక్ష చేసుకుంటే ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. అలాగే తాను లేనపుడు తన ఇంట్లో సోదాలు చేయడమేమిటని నిలదీశారు. కాసుపు పోలీసులకు కొట్టెకు వాగ్వివాదం జరిగిన తర్వాత పోలీసులు కొట్టెను బలవంతంగా అదుపులోకి తీసుకుని జీపు ఎక్కించి కృత్తివెన్ను పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం సాయంత్రం కొట్టె వెంకట్రావును విడిచిపెట్టారు.

# భూపంపిణీ జరగకపోతే పేదలకు న్యాయం జరగదు

## - ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు కలెక్టర్‌ల ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రికి మెమోరాండలు



**(విన్యూస్, విజయవాడ):** రాష్ట్రంలో భూమి లేని నిరుపేదలకు భూపంపిణీ జరగకపోతే న్యాయం జరగదని ఏ ప్రభుత్వం అధికారం లోకి వచ్చినా పేదలకు భూపంపిణీ చేయడం లేదని, అన్ని రకాల ప్రభుత్వ భూములు నిరుపేదలకు దక్కకుండా అన్యాక్రాంతము అవుతున్నాయని, ఖాళీగా వున్న భూములను గుర్తించి కోనేరు రంగారావు భూ కమిటీ సిఫారసులను అమలు చేసి నవరత్నాల్లో భూపంపిణీ ని చేర్చి పేదలకు పంచాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపు లో భాగంగా అన్ని జిల్లా కలెక్టర్ ల ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి కి మెమోరాండములు సోమవారం సమర్పించడం జరిగిందని,ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ తెలియజేశారు. ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ జిల్లా అధ్యక్షులు కృష్ణ ఉపాధ్యక్షులు మల్లికార్జున, సోమేశ్వర్ రెడ్డి %ూాౕఖీ% జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, ఏ ఐ టి యు సి జిల్లా నాయకులు శ్రీనివాసరావు కర్నూలు జిల్లా కలెక్టర్ ను కలిసి మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా ఆవుల శేఖర్ మాట్లాడుతూ స్వర్గీయ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలోనే పేదలకు భూపంపిణీ జరిగిందని, అప్పటినుంచి ఇప్పటివరకు ఏ ప్రభుత్వాలు కూడా భూపంపిణీ మాటే ఎత్తడం లేదని అన్నారు. గతంలో అసైన్మెంట్ కమిటీల ను సమావేశపరిచి భూ పంపిణీ జరిగేదని, ప్రస్తుతం అసైన్మెంట్ కమిటీలను నామరూపం లేకుండా చేశారని అన్నారు. పాలకుల ప్రమేయంతోనే ప్రభుత్వం భూములు మాయం అవుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా కలెక్టర్ ను ఆవుల శేఖర్ లు కలిసి మెమోరాండంను సమర్పించినప్పుడు కలెక్టర్ కోనేరు రంగారావు భూ కమిటీ సిఫారసులను అమలు చేయడానికి ప్రభుత్వం పూనుకున్నదని మండల తహసీల్దార్ లకు ఉత్తర్వులు కూడా అందాయని కలెక్టర్ లు చెప్పారని వారు తెలియజేసారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం చేసిన పోరాటాల వల్లే ఇది సాధ్యమైనదని అన్నారు. తక్షణమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా అన్ని రకాల ప్రభుత్వ భూములను గుర్తించి నవరత్నాల్లో భూ పంపిణీని చేర్చి, కోనేరు రంగారావు భూకమిటీ సిఫారసుల ద్వారా వాటిని పేదలకు పంచాలని వారు డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చే ముందు పేదవాళ్లకు భూ పంపిణీ చేస్తామని గొప్పలు చెబుతున్న ప్రభుత్వాలు కోనేరు రంగారావు భూకమిటీ సిఫార్సులను అమలు జరపకుండా చెత్తబుట్టలో పడేస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల వారికి భూములు లేవని, భూములు లేని కుటుంబాలు రాష్ట్రము లో చాలా ఉన్నాయని అన్నారు. పేదవాడికి భూమి ఉంటేనే గ్రామీణ కష్టజీవుల బ్రతుకుల్లో మార్పు వస్తుందని,వారి ఆత్మగౌరవం కూడా పెరుగుతుందన్నారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫారసులను అమలు చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కిందిస్థాయి రెవిన్యూ అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసిందని నిజంగా సంతోషకరమైన అంశమని అన్నారు. కోనేరు రంగారావు భూకమిటీ సిఫారసులను ఆమోదించి, గ్రామీణ కష్టజీవులకు న్యాయం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ కోరారు. కర్నూలు జిల్లాలో ప్రభుత్వ భూములు వేలాదేకాలు ఖాళీగా ఉన్నాయని వాటికని పేదలకు పెంచాలని వారు కలెక్టర్ని కోరారు

# కేంద్రం ఇచ్చే బియ్యానికి అడ్డెందుకు..

## - 5నెలల బియ్యాన్ని నిలిపేసిన ప్రభుత్వం




**(వి న్యూస్ పిడుగురాళ్ల):** పిడుగురాళ్ల పట్టణంలోని ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన ద్వారా కేంద్రం ఇచ్చే ఉచిత బియ్యాన్ని పేదలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా అందనీయట్లేదు. గతేడాది అక్టోబరులో ఇవ్వాల్సిన కోటా బియ్యాన్ని.. ఈ ఏడాది జనవరిలో ఇస్తామని అప్పట్లో చెప్పిన ప్రభుత్వం.. ఇప్పుడు దాని ఊసే మరచింది. గతేడాదిలో 5 నెలల పంపిణీకి మోకాలడ్డింది. కొవిడ్ కష్టాల్లో ఉన్న పేదలను ఆదుకునేందుకు కేంద్రం ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన ద్వారా ఉచిత బియ్యం అందజేస్తోంది. రాష్ట్రంలో 2 కోట్ల 68 లక్షల మంది పేదలకు నెలకు లక్షా 34 వేల టన్నుల చొప్పున కేటాయిస్తోంది. ఆరో విడత కింద గతేడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు ఇవ్వాల్సి ఉండగా.. రాష్ట్రం అందులో 4 నెలలు పంచకుండా నిలిపేసింది. కేంద్రం హెచ్చరించడంతో ఆహార భద్రత కార్డుల్లో మార్పులు చేసి.. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో అందించింది. ఏడో విడతలో మళ్లీ మొండిచేయి చూపింది. ఈ బియ్యాన్ని 2023 జనవరిలో ఇస్తామని అధికారులు అప్పట్లో చెప్పారు. ఇప్పుడు ఆ బియ్యం ఊసే లేదు. అంటే గత సంవత్సరానికి సంబంధించి ఐదు నెలల బియ్యాన్ని ఇవ్వలేదు. ఈ నెల నుంచి ప్రజా పంపిణీ వ్యవస్థ కింద ఇచ్చే ఉచిత బియ్యాన్నే అందిస్తోంది. కొవిడ్ ఆరంభం నుంచి ఎన్ఎఫ్ఎస్ఏ కార్డుదారులతోపాటు రాష్ట్ర ప్రభుత్వం తమ పరిధిలోని కార్డుదారులకూ ప్రతినెలా ఉచిత బియ్యం ఇచ్చింది. గతేడాది మార్చి తర్వాత మొత్తం కార్డులకు కేంద్రమే బియ్యం ఇవ్వాలని తేల్చి చెప్పింది. కానీ పేదలకు ఉచిత బియ్యం ఇవ్వకపోతే.. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలునే నిలిపేస్తామని కేంద్రం గట్టిగా చెప్పడంతో దిగొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం.. ఎన్ఎఫ్ఎస్ఏ కార్డుల్లో భారీ మార్పుచేర్పులు చేసింది. 2022 ఆగస్టు నుంచి కేంద్ర ప్రభుత్వ పరిధిలోని కార్డుదారులకే పీఎంజీకేఏవై బియ్యాన్ని పరిమితం చేసింది. రాష్ట్ర కార్డుదారులకు మొండిచేయి చూపింది.

# వైకుంఠ ఏకాదశి చుంచులూరులోఘనంగా లక్ష తులసి దళార్చన.....



**(వి న్యూస్ మద్రిపాడు):** తులసీ దళములతో స్వామిని పూజించడం ద్వారా సమస్త గ్రహదోష విముక్తులై, ఆయురారోగ్య ఐశ్వర్య అభివృద్ధి లభిస్తాయని చుంచులూరు గ్రామ రాములు దేవస్థానం ప్రధాన అర్చకులు సామవేద శిరోమణి మురళీకృష్ణ శర్మ తెలిపారు. మద్రిపాడు మండలంలోని చుంచులూరు గ్రామంలో వెలసిఉన్న రామాలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. లోక కళ్యాణార్థం లక్ష తులసీ దళార్చన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం కార్తీక శుద్ధ పౌర్ణమి రోజు కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు గ్రామస్తులు సందర్శించారు. స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మాట్లాడుతూ పరమ పవిత్రమైన ముక్కోటి ఏకాదశి రోజు మిక్కిలి ప్రీతిమైన తులసి దళములతో మహిమాన్వితములైన శ్రీ విష్ణు సహస్రనామములతో స్వామికి జరిగే అర్చనలో పాల్గొని సమస్త గ్రహదోష విముక్తులై, ఆయురారోగ్య ఐశ్వర్య అభివృద్ధిని పొందగలరని సామవేద శిరోమణి మురళీకృష్ణ శర్మ ఆకాంక్షించారు. వివిధ రకాల హారతులు, అభిషేకాలు, వైకుంఠ ద్వార దర్శనం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని భక్తులు పాల్గొని పూజలు నిర్వహించి అన్నప్రసాదాలను స్వీకరించారు.


**V స్మార్ట్ యాడ్స్**

**Insurance**

యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా అన్ని రకాల వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించబడును. ఇన్సూరెన్స్ చేయించుకోదలచిన వారు సంప్రదించండి: టి.సి.ఎన్ శ్రీనివాస్. 9246761404 08672-221097

**LOANS**

HOME LOANS BUSINESS LOANS... PLEASE CONTACT: 9399936609

**వి స్మార్ట్ యాడ్స్ కేవలం రూ.100/-లకే స్మార్ట్ యాడ్..**

-----------

సంప్రదించండి 9848667347

**LOANS**

పర్సనల్ లోన్స్, బిజినెస్ లోన్స్, అగ్రికల్చర్ లోన్స్, ఎడ్యుకేషన్ లోన్స్ అన్ని రకాలలోన్స్ 2 రోజుల్లో ఇప్పించబడును. వడ్డీ 50 పైసలు. 1 లక్ష నుంచి 50లక్షల వరకు ఇవ్వబడును. కావల్సిన వారు సంప్రదించండి: 7095129660

**మస్కిటో డోర్స్&విండోస్**

చక్రిస్ మస్కిటోడోర్స్&విండోస్... అల్యూమినియమ్ మస్కిటో డోర్స్&విండోస్ తయారు చేయబడును. మరియు రిపేర్ చేయబడును. సంప్రదించండి: చక్రిస్ మస్కిటోడోర్స్&విండోస్ గొడుగుపేట-మచిలీపట్నం సెల్:9182197822 9121605277

**తక్కువధరకే ప్రకటనలు**

ఇల్లు/స్థలం అమ్మలన్నా, కొనాలన్నా, అద్దెకు ఇవ్వాలన్నా, ఉద్యోగం కావాలన్నా, ఉద్యోగులు కావాలన్నా తక్కువ ధరతో విన్యూస్‌లో ప్రకటన ఇచ్చి నిశ్చింతంగా ఉండండి. మరిన్ని వివరాలకు సంప్ర: 9848667347

**LOANS**

BUSINESS LOANS MORTIGAGE LOANS CONTACT: 9491624334

**అమ్మబడును**

మచిలీపట్నం శివారు రాడార్ కేంద్రం దగ్గర కళ్యాణీటౌన్‌షిప్‌లో 300గజాల ఫ్లాట్ అమ్మబడును. కావల్సిన వారు సంప్రదించండి: సెల్: 7032931205 సంప్రదించు వేళలు: ఉదయం11 - 2పిఎం







**వంట మనిషి కావలెను**

మచిలీపట్నం జల్లువారితోట డీమార్టు వెనుక నలుగురు గల కుటుంబంనకు వంట మనిషి కావలెను. (నాన్‌వెజ్) సంప్రదించండి: (ఉదయం10 నుంచి2గంటల) సెల్:7032931205











# పోర్టు భూసేకరణ తొలి దశ ప్రక్రియ మరో వారం రోజుల్లో పూర్తి కావాలి - జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా



**(వి న్యూస్ మచిలీపట్నం):** మచిలీపట్నం పోర్టు నిర్మాణానికి సంబంధించి తొలి దశ భూసేకరణ ప్రక్రియ మరో వారం రోజుల వ్యవధిలో పూర్తి చేయాలని వలు శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు.

సోమవారం సాయంత్రం ఆయన తన చాంబర్ లో మచిలీపట్నం పోర్టు నిర్మాణకు సంబంధించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ, ఏపీ మారిటైం బోర్డు ఆదేశించిన మేరకు మూడు దశల్లో పోర్టుకు కావాల్సిన 3,400 ఎకరాలు సేకరించాల్సి ఉందన్నారు. తొలి దశలో 1730. 32 ఎకరాలకు సంబంధించిన సరిహద్దులు నిర్ధారించాలని, ఇప్పటికే కోర్టుకు అడ్వాన్స్ పొజిషన్ సమర్పించినట్లు ఆయన తెలిపారు. పోర్టు ల్యాండ్ పరిధిలో ఉన్న భూముల్లో ప్రస్తుతం వేరుశనగ పంట ఉందని కాయతీ తర్వాత, ఆ వ్యవసాయ క్షేత్రంలో ఆ తదుపరి పంటలను సాగు చేయకుండా కట్టడి చేయాలన్నారు. ప్రభుత్వం ప్రవేటు భూముల యజమానులకు నష్టపరిహారం ఎంత చెల్లించాలనేది అంచనా వేసి పంపించాలన్నారు. వారికి ఏమైనా నోటీసులు ఇవ్వాలంటే త్వరితగతిన తాసిల్దార్ ఇచ్చి తిరిగి వెనక్కి తీసుకోవాల్సిన భూములను సేకరించాలన్నారు. ఆర్డర్ తర్వాత వారికి డబ్బులు వెనక్కి ఇచ్చే ఏర్పాట్లు చేయాలన్నారు.

రహదారుల అనుసంధానికి ప్రివ్యూ నోటిఫికేషన్ సంబంధించి ముడా కొనుగోలు చేసిన భూములలోనే 3.5 కిలోమీటర్ల రోడ్డు నిర్మించుకోవాలని కలెక్టర్ సూచించారు. పోతేపల్లి, చిలకలపూడి మంగినపూడి, కరగ్రహారం మీదుగా కొనసాగి రోడ్డు గత ప్రభుత్వంలో నిర్మించిన పైలాన్ సమీపంలోని ఐస్ ఫ్యాక్టరీ మధ్యలో నుండి ఈ రహదారి కొనసాగుతుందన్నారు.

జనవరి 10వ తేదీలోపు నిర్దేశించిన మ్యాపును స్పష్టంగా వివిధ రంగుల్లో చిత్రీకరించి తనకు అందజేయాలని ల్యాండ్ అండ్ రికార్డ్స్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ డాక్టర్ అపరాజిత సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు, ముడా వైస్ చైర్మన్ బి.శివ నారాయణరెడ్డి, మ్యారి టైం బోర్డు డైరెక్టర్ విద్యాశంకర్, మచిలీపట్నం తహసీల్దార్ సునీల్‌బాబు, జిల్లా ల్యాండ్ రికార్డ్స్ సూపర్డెంట్ రాధిక, ముడా, మ్యారీటైం బోర్డు, జిల్లా ల్యాండ్ అండ్ రికార్డ్స్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యత నివ్వాలి

## - ఆధార్ నమోదు కిట్లు పంపిణీ చేసిన కలెక్టర్

## - దివ్యాంగుల సంక్షేమ శాఖ ద్వారా ల్యాప్టాప్ పంపిణీ చేసిన కలెక్టర్



**(వి న్యూస్ మచిలీపట్నం):** అర్జీదారు సంతృప్తే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రవేశ పెట్టిందని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్ జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ డా. అపరాజిత సింగ్ స్పందన నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. స్పందన గ్రీవెన్స్ పరిష్కార వ్యవస్థ మరింత సమర్ధవంతంగా అమలు చేసేందుకు ప్రజల సమస్యలు సూక్ష్మస్థాయిలో పరిశీలించి సమర్ధవంతంగా పరిష్కరించేందుకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రభుత్వం ప్రవేశ పెడుతుందన్నారు. స్పందనలో భాగంగా ఈ కార్యక్రమంలో వచ్చిన అర్జీల పెండింగ్ కలెక్టర్ స్పందనలో సమీక్షించారు. జగనన్నకు చెబుదాం అర్జీల పెండింగ్ 282 ఉన్నాయని, పెండింగ్ పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు.

జిల్లాలో ఈ-ఆఫీస్ అమలు పటిష్టవంతంగా చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. జీఓలో పేర్కొన్న విధంగా వివిధ శాఖల్లో ఫైళ్లు అన్నీ ఈ-ఆఫీస్ ద్వారానే పంపాల్సి ఉంటుందన్నారు. అంతేకాకుండా అన్ని కార్యాలయాల్లో ఈ-టపాల్స్, ఈ-డిస్పాచ్ కచ్చితంగా అమలు చేయాలన్నారు.

నేటి నుండి అన్ని కార్యాలయాల్లో ముఖ ఆధారిత హాజరు నమోదుకు ప్రభుత్వం జారీచేసిన ఆదేశాల అమలుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకో కోవాలన్నారు. సిబ్బంది అందరూ సంబంధిత యాప్ డౌన్లోడ్ చేసుకొని కచ్చితంగా ముఖ ఆధారిత హాజరు నమోదు చేయాలన్నారు. జిల్లాలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధనలో 8 అభివృద్ధి సూచికలలో నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలన్నారు. ముఖ్యంగా జిల్లాలో గుర్తించిన పిల్లలలో తక్కువ బరువు, ఎత్తు తక్కువ నివారణకు బాలామృతం, జగనన్న గోరుముద్ద వంటి పథకాల కింద పౌష్టికాహారాన్ని అందిస్తూ, అవసరమైన వైద్యం అందిస్తూ వారిలో వారం వారం ఎదుగుదల నమోదు చేస్తూ, నెలవారీ నివేదికలు సమర్పించాలన్నారు. ఈనెల 11వ తేదీ ముఖ్యమంత్రి చీఫ్ ఎగ్జిక్యూటివ్ సమీర్ శర్మ జిల్లా అధికారులతో సమీక్షించనున్నారని నివేదకలు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో ఆరోగ్యశ్రీ కార్డులు ఈ కేవైసీ 47 శాతం పూర్తయిందని, మిగతా పెండింగ్ త్వరగా పూర్తి చేయించాలని డిఎంఅండ్ హెచ్ఓకు సూచించారు. రైస్కార్డులు వాలంటీర్ల లాగిన్ లో ఈకేవైసీ నమోదుకు సంబంధించి 300 పెండింగ్ ఉన్నాయని, వెంటనే క్లియర్ చేయించాల ని డిఎస్ఓకు సూచించారు. వెల్ఫేర్ సెక్రటరీలు వారి పరిధిలో పాఠశాలల్లో హెచ్ఎంలకు టెక్నికల్ సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించేలా చూడాలని డిఇఓకు కలెక్టర్ సూచించారు.

ఆధార్ నమోదు కిట్లు పంపిణీ చేసిన కలెక్టర్ జిల్లాలో గ్రామ/వార్డు సచివాలయాల్లో 101 ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు, అందుకు గాను ఒక్కొక్కటి లక్షన్నర విలువైన ల్యాప్టాప్ సంబంధిత పరికరాలతో కూడిన కిట్లు ఆయా సచివాలయ టెక్నికల్ అసిస్టెంట్లకు కలెక్టర్ పంపిణీ గావించారు. 10 సంవత్సరాలు దాటితే ఆధార్ తప్పనిసరిగా అప్డేట్ చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. అంతే కాకుండా వివిధ సంక్షేమ పథకాలలో ఆధార్ సంబంధిత సమస్యలు

సచివాలయాల్లోనే పరిష్కారమవుతాయన్నారు. జిల్లా స్థాయిలో ఆధార్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఆధార్ సమస్యలు లేకుండా చూడాలని సచివాలయాల టెక్నికల్ అసిస్టెంట్లకు కలెక్టర్ సూచించారు. జిల్లా దివ్యాంగుల సీనియర్ సిటిజన్ సంక్షేమ శాఖ ద్వారా ఇద్దరు దివ్యాంగులకు ల్యాప్టాప్లు కలెక్టర్ అందజేశారు. ఈ సమావేశంలో డిఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, మూడా వీసి బి. శివనారాయణ రెడ్డి, డిఎంఅండ్ హెచ్ డా.గీతాబాయి, పీడి ఐసిడీఎస్ సువర్ణ, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ, డిఇఓ తహెరా సుల్తానా, డిఎస్ఓ వి. పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న విజయ కుమార్




**(వి న్యూస్ గన్నవరం):** క్రీడా రంగంలో రాణించి జాతీయ స్థాయిలో అనేక పథకాలు సాధించి, అనేక మంది క్రీడాకారులను జాతీయ స్థాయిలో తయారు చేస్తున్న గోగులమూడి విజయ్ కుమార్ కు జాతీయస్థాయిలో ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుల పురస్కారం లభించింది. కృష్ణా జిల్లా గన్నవరం మండలం చిన్న అవుటపల్లి గ్రామానికి చెందిన గోగులమూడి విజయ్ కుమార్ కి రోజా క్రియేటివ్ కల్చరల్ వరంగల్ వారు ఈ మేరకు ఆదివారం కాజిపేటలో జరిగిన పురస్కార మహోత్సవ సభలో విజయ్ కుమార్ ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఈ పురస్కారం అందుకోవడం చాలా సంతోషంగా ఉందని, సోమవారం పురస్కార గ్రహీత విజయ్ కుమార్ ఆనందం వ్యక్తం చేసారు.

# ఒంటె వాహనంపై ఊరేగిన సువర్చలాంజనేయ స్వామి



**(వి న్యూస్,మచిలీపట్నం):** మచిలీపట్నం పరాసు పేట లో వేంచేసి ఉన్న సువార్చలా సమేత ఆంజనేయ స్వామికి సోమవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారిని విశేషాలు అలంకరణలు, పూజలు, అభిషేకాలు,నిర్వహించి ఉత్తర ద్వారం ద్వారా వల్లకిలో తీసుకువచ్చి ఒంటె వాహనం పై,ఊరేగించారు. ఈ ఊరేగింపు పరాసు పేట, దిమ్మల సెంటర్, తదితర ప్రాంతాల ద్వారా ఊరేగింపు నిర్వహించి తిరిగి దేవాలయానికి చేర్చారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు అగ్నిహోత్రం ప్రసన్న కుమార్, ఆలయ కార్యనిర్వహణ అధికారి తిక్కిశెట్టి వీర వెంకట మోహన్ రావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వెంట ఊరేగింపులో పాల్గొన్నారు.

# అమ్మవారికి విశేష పూజలు..

**(వి న్యూస్ మచిలీపట్నం):** పోర్ట్ రోడ్డు ఉన్న తాడేపల్లి వారి ధర్మసత్రం లో ఈరోజు ధనుర్మాస ముక్కోటి ఏకాదశి సందర్భంగా అమ్మవారిని జగన్మోహిని ఆకారంలో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.



అనంతరం మంత్రపుష్పం తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ధర్మసత్రం అధ్యక్షులు తాడేపల్లి నాగ వెంకట మురళీకృష్ణ, ట్రస్టీలు తాడేపల్లి అశోక్ కుమార్, తాడేపల్లి జగదీష్ కుమార్, తాడేపల్లి కృష్ణప్రసాద్,సిహెచ్ వి పణి కేశవరావు పాల్గొన్నారు.


## పేరు మార్పు

నెరుసు జయలక్ష్మి w/o విన్నకోట మల్లేశ్వరరావు డోనెం:20-40-13, నరసింహానగర్, చిలకలపూడి, మచిలీపట్నం., కృష్ణాజిల్లా వాస్తవ్యురాలిని. నా అసలు పేరు నెరుసు జయలక్ష్మి . నాకు విన్నకోట మల్లేశ్వరరావుతో వివాహం జరిగి తర్వాత నా పేరు విన్నకోట జయలక్ష్మి అయ్యింది. అయితే నాకు సంబందించిన ఆధార్‌కార్డు, ఓటరుకార్డులలో నెరుసు జయలక్ష్మి అనే నమోదయ్యింది. నెరుసు జయలక్ష్మి అయినా విన్నకోట జయలక్ష్మి అయినా నేనే అని గుర్తించగలరు. ఇట్లు.,

నెరుసు జయలక్ష్మి W/O విన్నకోట మల్లేశ్వరరావు, డోనెం:20-40-13, నరసింహానగర్, చిలకలపూడి, మచిలీపట్నం. కృష్ణాజిల్లా.


# రాష్ట్రంలోని గ్రామాల అభివృద్ధికి తానా సంస్థ , ప్రతి ఎన్నారై కృషి చేయాలి - ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు బాబు రాజేంద్రప్రసాద్.




**(వి న్యూస్ గన్నవరం):** కృష్ణాజిల్లా,గన్నవరం నియోజకవర్గం, పెదవుటపల్లి గ్రామంలో అమెరికాలోని దిగ్గజ సేవా సంస్థ అయినటువంటి తానా సంస్థ అధ్యక్షులు లావు అంజయ్య చౌదరి , ఆ సంస్థ ప్రతినిధులు నిర్వహించిన క్యాన్సర్ , ఇతర మెడికల్ క్యాంప్ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన బాబు రాజేంద్రప్రసాద్. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అగ్రరాజ్యమైనటువంటి అమెరికా దేశంలో మన తెలుగువారు తానా ఫౌండేషన్ స్థాపించి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టటం ఆనందదాయకమని, అదేవిధంగా మన రాష్ట్రంలో గ్రామాలలోని రోడ్లు, త్రాగునీరు, డ్రైనేజీ , ఇతర మౌలిక సదుపాయాలు దయనీయంగా ఉన్నాయని, కనుక ఒక రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడిగా మీ తానా సంస్థ వారిని, అలాగే ప్రతి ఎన్నారై ని కొన్ని గ్రామాలు దత్తత తీసుకొని వాటిని అభివృద్ధి చేయవలసిందిగా కోరుచున్నానని రాజేంద్ర ప్రసాద్ అన్నారు. తదుపరి తానా సంస్థ ద్వారా తెలుగువారికి అనేక సేవా కార్యక్రమాలు అందిస్తున్నటువంటి తానా సంస్థ అధ్యక్షులు లావు అంజయ్య చౌదరి,సతీష్ వేమూరి, రవి పొట్లూరి, సునీల్ పాంత్ర, రాజా కుసుక్కుర్తి, సురేష్ పుట్టగుంట, సురేష్ ఓరుగంటి,,శశాంక్ యార్లగడ్డ, ఠాగూర్ మలినేని, శ్రీనివాస్, తదితరులను రాజేంద్రప్రసాద్ , శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర బీసీ సాధికార సగర అధ్యక్షులు జంపన వీర శ్రీనివాస్, చలపాటి శ్రీను, లంకె అప్పలనాయుడు, వాసు తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల ఆదేశాల మేరకే ఖాళీ స్థలాల్లో పన్ను వేస్తాం - గ్రామ సభలో తీర్మానం



**(వి న్యూస్ హనుమాన్ జంక్షన్):** బాపులపాడు మండలం బాపులపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం సర్పంచ్ సరిపల్లి కమలా బాయి అధ్యక్షతన ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో గ్రామంలో వివిధ ప్రదేశాల్లో స్వీట్ షాపుల కారా?నాలను నిర్వహిసన్తా సమీపంలో నివశిస్తున్నవారికి సంబంధించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదులు అందించారు. చెత్త చెదారములు డ్రైనేజీల్లోకి వదులుట వలన అచ్చటి ప్రజలు తీవ్ర అనారోగ్యము ఎదుర్కొనుచునట్లు పిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి కి అర్జీలు సమర్పించారు. అంతే కాకుండా గ్రామంలోని ఖాళీ స్థలాలకు పన్ను విధించుటకు గాను పలు విజ్ఞప్తులు గ్రామస్తుల నుండి వస్తున్న నేపథ్యమున జిల్లా పంచాయతీ అధికారి, కృష్ణా, మచిలీపట్నం వారి ఆదేశాలు వచ్చిన పిమ్మట వారి సూచనలు మేరకు తగు నిర్ణయము తీసుకుని అవసరమైన వారి నుండి ఖాళీ స్థలాలను పై పన్ను కట్టించుకొనుటకు గ్రామ సభలో తీర్మానం చేశారు. ఈ గ్రామ సభ సమావేశంలో సచివాలయం అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



**(వి న్యూస్ హనుమాన్ జంక్షన్):** హనుమాన్ జంక్షన్ లోని స్థానిక శ్రవంతి ఛారిటుల్ ట్రస్టు వ్యవస్థాపకులు వీరమాచినేని సత్యప్రసాద్ శ్రీదేవి దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేశారు. జర్నలిస్టులు తాడి రంగారావు, రొంపల్లి అచ్యుత రావు, ఇంటి దేవసహాయం, కొరపాటి శ్రీధర్ లను అలాగే గురువులు డివి రమణ రామకృష్ణలను నూతన శుభాకాంక్షలు తెలియజేసి పుష్పగుచ్ఛాలు, శాలువలతో ఘనంగా సత్కరించారు. నూతన సంవత్సరం ప్రతి ఒకరి జీవితాల్లో కష్టాలు తొలిగిపోయి సంపూర్ణ ఆరోగ్యంతో పాటు వెలుగులు ప్రసాదించాలని భగవంతుడు కోరుకుంటున్నట్లు శ్రవంతి ట్రస్టు అధినేత సత్యప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వాసిరెడ్డి మనోజ్ కుమార్, లంక రమేష్, జాస్తి భూపతి, వడిల్లీ లక్ష్మి, కంపసాటి కొండ, మేడేపూడి రామ్మోహన్ రావు, వీరమాచినేని బుజ్జి, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణాజిల్లా, అవనిగడ్డ పంచాయతీ పూర్వపు శానిటరీ ఇనస్పెక్టర్ కె.సుధాకర్‌పై క్రమశిక్షణా చర్యలను వెంటనే తీసుకోండి

## - రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమీషనర్ కోన శశిధరను రాష్ట్ర సమాచార కమీషనర్ ఐలాపురం రాజా

## - చర్యల నివేదికను కమేషన్ కు సమర్పించండ



Sri Ilapuram Raja
State Information Commissioner

**(వి న్యూస్ విజయవాడ):** కృష్ణాజిల్లా , అవనిగడ్డ గ్రామపంచాయతీలో జనన నమోదు రిజిష్టరులో జననతేదీలను దిద్ది ధృవీకరణపత్రాలను జారీచేసిన కేసులో వెంటనే విచారణ పూర్తి చేయాల్సిందిగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమీషనర్ కోన శశిధర్ ను రాష్ట్ర సమాచార శాఖ కమీషనర్ ఐలాపురం రాజా విచారణను వెంటనే పూర్తి చేసి, నిబంధనల ప్రకారం క్రమశిక్షణా చర్యలను తీసుకోవాల్సిందిగా ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన లో విడుదల చేశారు. స.హ. చట్టం క్రింద అవనిగడ్డ గ్రామపంచాయతీ రికార్డుల ట్యాంపరింగ్ విషయమై ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వ సమాచార కమీషన్ లో 2016 లో నమోదైన ఫిర్యాదుపై ది.06-12-2022న విచారణ జరిపిన సమాచార కమీషనర్ ఐలాపురం రాజా గత 7 సంవత్సరాలుగా సుదీర్ఘ విచారణ చేయటంపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ, ఈ రికార్డుల ట్యాంపరింగ్ లో ఆరోపణలు ఉన్న శానటరీ ఇనస్పెక్టర్ కె.సుధాకర్ పై, పూర్వపు కార్యదర్శి వి.రంగారావుపై విచారణ పూర్తి చేయాల్సిందిగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమీషనర్ కోన శశిధర్ ను ఆదేశించారు. అవనిగడ్డ గ్రామపంచాయతీలో 2015 నవంబరు నెలలో జనన నమోదు రిజిష్టరును తారుమారు చేసి కళ్ళేపల్లి శివతేజ, కళ్ళేపల్లి సాయిచరణ్ కు జనన ధృవీకరణ పత్రాలను అప్పటి పంచాయతీ కార్యదర్శి వి.రంగారావు, శానిటర్ ఇనస్పెక్టర్ కె. సుధాకర్ లు జారీచేయటం జరిగింది. ఈ విషయమైది. 19-09-2016న అప్పటి జిల్లా కలెక్టర్ అహమ్మద్ బాబు కి సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ ఫిర్యాదు చేయడం జరిగింది. ఇప్పటికే ఈ కేసులో పంచాయతీ గ్రేడ్- ! కార్యదర్శి వి.రంగారావును నిర్బంధ పదవీవిరమణ చేస్తూ పంచాయతీరాజ్ శాఖ కమీషనర్ ఉత్తర్వులు జారీ చేయటం జరిగిందని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ ఓ ప్రకటన లో తెలిపారు.

# నూతనముగా మంజూరు అయిన 732 పెన్షన్ ల పంపిణీ



**(వి న్యూస్ మచిలీపట్నం):** మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్ లలో నూతనముగా మంజూరు చేసిన వైఎస్ఆర్ పెన్షన్ లను లబ్ధిదారులకు అందజేయు కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమానికి నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ ముఖ్య అతిధులుగా విచ్చేసారు. మొదటగా ఉదయం 8.00 లకు స్థానిక రాజు పేట షాధీ ఖానా దగ్గర 25 నుండి 40 డివిజన్ లకు గాను 254 మందికి పెన్షన్ లు పంపిణీ చేయుట జరిగినది. తర్వాత ఉదయం 10.00 గంటలకు స్థానిక టౌన్ హాల్, బుట్టాయి పేట నందు 13, 15 నుండి 24 డివిజన్ వరకు గానూ 168 మంది లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేయడం జరిగినది. తర్వాత ఉదయం 11.30 నిమిషాలకు స్థానిక బైపాస్ రోడ్డు వాసవి కళ్యాణ మంటపం దగ్గర 1, 41 నుండి 50 డివిజన్ లకు గాను 154 మంది లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేయడం జరిగినది. చివరగా స్థానిక 9 వ డివిజన్ పరిధిలోని రైస్ మిల్లర్ అసోసియేషన్ ఫంక్షన్ హల్ నందు 14, 2 నుండి 12 డివిజన్ వరకు గానూ 156 మంది లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేయడం జరిగినది. మొత్తం అన్ని డివిజన్ లకు కలిపి జనవరి 2023 నెలకు గాను నూతనముగా మంజూరు అయిన 732 పెన్షన్ లతో మొత్తం 20,51,750 రూపాయలను లబ్ధిదారులకు అందించారు. దీనితో పాటుగా లబ్ధిదారులకు మన రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు వైఎస్ జగన్మోహన్ రెడ్డిహౌహౌసందేశము తో పాటు నూతన పెన్షన్ బుక్ అందజేయటం జరిగినది. ఈ కార్యక్రమంలో నగర మేయర్‌హౌమోకా వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ మన మచిలీపట్నం శాసనసభ్యులు మాజీ మంత్రి వర్యులు పేర్ని వెంకట్రామయ్య చొరవతో జగన్‌హౌసహకారము తో పెన్షన్ కి దరఖాస్తు చేసిన తక్కువ రోజుల్లోనే పెన్షన్ మంజూరు చేసి ఈ విధముగా అందరికీ పంపిణీ చేయుట జరుగుతున్నదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగర వైఎస్సార్సీపీ అధ్యక్షులు షేక్ సిలార్ దాదా, డిప్యూటీ మేయర్‌హౌహౌలంకా సూరిబాబు, డిప్యూటీ మేయర్.హౌతంటిపూడి కవిత థామస్, బూరగడ్డ రమేష్ నాయుడు, మాజీ అర్బన్ బ్యాంక్ ఛైర్మెన్ బొర్రా విఠల్, అన్ని డివిజన్ ల కార్పొరేట్ లు, ఇంఛార్జిలు, కో - ఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వాలంటీరే దొంగ నోట్లను కలిపాడు



**(వి న్యూస్ మార్కాపురం):** ప్రకాశం జిల్లా యర్రగొండ పాలెం మండలం నర్సయపాలెంలో నిన్న ఆసరా ఫించన్లు పంపిణీ చేసిన వాలంటీర్. అందులో 19, 500 దొంగనోట్లు వచ్చినట్లు తెలుసుకున్న ఫించన్ దారులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇది రాష్ట్రంలో, జిల్లాలో సంచలనమైన విషయం విదితమే. ఎంపిడిఓ , సంభదిత అధికారులు తమదైన శైలిలో వాలంటీర్ ముటుకూరి అమోష్ ను విచారణ చేయగా తానే దొంగనోట్లు కలిపి పంచినట్లు ఒప్పుకున్నాడు. ఎంపిడిఓ పోలీసులకు ఫిర్యాదు మేరకు ఈ దొంగనోట్లు వలంటీరు ఎలా వచ్చాయి? ఈ దొంగనోట్ల వెనుక ఎవరు ఉన్నారు? తదితర విషయాలపై పూర్తి విచారణ చేస్తున్నట్లు సమాచారం.

# జనవరి 3 నుండి 5వ నాబార్డ్ క్రాఫ్ట్ మేళా 2023 ప్రారంభం

**(వి న్యూస్ విజయవాడ):** విజయవాడలోని గురునానక్ నగర్ ఆర్టీసీ కాలనీలోని వివిధ కళలను ప్రోత్సహించేందుకు నాబార్డ్ ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయం 5వ నాబార్డ్ క్రాఫ్ట్ మేళా-2023ని 3 జనవరి 2022 నుండి జనవరి 12, 2023 వరకు మేరీ స్టెల్లా ఇండోర్ స్టేడియం, పంటకాలువ రోడ్, ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో నిర్వహిస్తోంది. హస్తకళలు మరియు చేనేతలతో పాటు గ్రామీణ మహిళలు తమ ఉత్పత్తులను ప్రదర్శించడానికి మరియు వాటిని సరసమైన ధరలకు విక్రయించడానికి వివిధ ఉత్పత్తుల ఉత్పత్తిలో నిమగ్నమై ఉన్నారు. ఈ క్రాఫ్ట్ మేళాను ఆరోగ్య, కుటుంబ సంక్షేమం మరియు వైద్య విద్య మంత్రి విడదల రజిని ప్రారంభించనున్నారు. ఆంధ్రప్రదేశ్లో 3 జనవరి 2023న మధ్యాహ్నం 3.30 గంటలకు. పొందూరు, వెంకటగిరి, మంగళగిరి, పోచంపల్లి, మహేశ్వరి, కలంకరి నుండి చేనేత వస్త్రాలు అమ్మకానికి ప్రదర్శించబడుతున్నాయి. కొండపల్లి, ఏటికొప్పాక, తిరుపతి చెక్క బొమ్మలుబీ ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఛత్తీస్గఢ్, ఒడిశా మరియు తెలంగాణ రాష్ట్రాల నుండి గాజు ఉత్పత్తులు, లెదర్ తోలుబొమ్మలు, జనపనార సంచులు, ఆభరణాలు, అలంకార మరియు ఇతర ఉత్పత్తులు ఉంటాయి. అందరూ మేళాను సందర్శించి ఉత్పత్తులను కొనుగోలు చేసి కళాకారులను ప్రోత్సహించాలని కోరారు.

Owned by EDITOR and Publisher: PREM NATH THOKALA, 26/152, Buttaipet, Machilipatnam, Krishna Dist.,Printed at Sri Lakshmi Ofset Printer binders, D.no : 32-26-126/13, opp BSNL Bhavan, Chuttagunta, Vijayawada-4. ph:08672 227347.,cell 9848667347 - RNI NO: APTEL/2015/65279